





# పజిల్

- ఆకెళ్ల శివ ప్రసాద్

ఫణీంద్రకి టెన్షన్‌గా ఉంది... శరీరంలో చిన్నగా వణుకు....
భయమా అనే అనుమానం కలుగుతోంది.... కానీ అది భయం కాదని తెలుసు... బెంగా?.... ఎమో?.....
అనుకున్నది అనుకున్నట్టు జరిగితే...?
ఆనందమయమే జీవితం.
ఈ సారి అంచాన తారుమారు అవ్వడానికి వీల్లేదు... 'కానీ'...?
'కానీ' ఏ సవాలక్ష ప్రశ్నలు పుట్టిస్తోంది.
ధృఢ సంకల్పం ఉంటే అందుకోలేనిదని జీవితం చెప్తోంది.
చిన్నప్పుడు....
ఆర్థికంగా మరీ దారుణ పరిస్థితిల్లో ఉన్నప్పుడు అసలు చదువు కోగలడా అనుకున్నాడు...
కానీ చదువు కోగలిగాడు... పదో తరగతి వరుకు గవర్నమెంట్
పాఠశాల్లో.... ఆ తరువాత కాలేజీ చదువులన్నీ స్కాలర్‌షిప్‌లతో నడిచాయి...
తమ యింట్లో పి.జీ. చేసిన వాళ్ళలో తనే మొదటి వాడు...
చదువయ్యాకా...
హోదా గల ఉద్యోగం రావాలి అనుకున్నాడు.... క్లర్క్ పోటీ పరీక్షలు రాయదల్చు కోలేదు.... ఆఫీసర్ పరీక్షలకి కూడా ఎక్కువగా అప్లయ్ చేయలేదు... ఒకే ఒకటి రాశాడు.... బ్యాంకులో ఆఫీసరయ్యాడు...!
ఆఫీసర్ ప్రొబేషన్ అయ్యాకా...
తమ వూళ్ళోనే ఫ్యామిలీ డెవలెప్ చేయచ్చనుకొన్నాడు....
పెద్దగా ప్రయత్నం చేయకుండానే... మెరిట్ మీద కావలసిన వూళ్లోనే ఉద్యోగం వచ్చింది...
అనుకొన్నది అనుకున్నట్టు జరిగింది.
అపజయం అనేది లేకుండా సాగి పోతున్న, జీవితంలో 'సుమిత్ర'
రూపంలో చేదు అనుభవం మిగిల్చింది.
సుమిత్ర దూరపు బంధువుల అమ్మాయి.
కుందనపు బొమ్మలా
ఉంటుందంటారు అంతా. ఆమె కళ్ళలో సమ్మోహణ శక్తి ఉందని కొందరంటే, ముక్కు తిమ్మన కూడా వర్ణించలేని ముక్కువల్ల

చంద్రబింబంలాంటి ముఖానికి అపురూప ఆకర్షణ వచ్చిందని ఇంకొందరు అంటారు. ఆమె చూపులో మోనాలిసా ఆర్ద్రత ఉందని మరి కొందరి అభిప్రాయం. టూకీగా చెప్పాలంటే, చాలా అందంగా ఉంటుందని, అందానికే అందం అన్పిస్తుందని తెలుసున్న వాళ్ళుందరి నమ్మకం.

సుమిత్ర తండ్రి స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా చేసేవాడు. ముగ్గురాడపిల్లల్లో రెండోది సుమిత్ర. పెద్ద అమ్మాయి పెళ్ళయ్యింది. సుమిత్ర పెళ్ళి ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. త్వరలో రిటైర్డ్ కూడా అవుతుండడం వల్ల తండ్రి సుమిత్ర పెళ్ళి విషయంలో తొందర పడ్తున్నట్టు తెలిసింది.

సుమిత్రని మొదటిసారి ఫణీంద్ర బంధువుల యింటికి పెళ్ళికి వెళ్ళినప్పుడు చూశాడు. పెద్దగా అలంకరణలు లేకపోయినా సుమిత్రంటే. ఆకర్షణ ఏర్పడింది. నిజానికి పెళ్ళిలో పెళ్ళి కుమారుకన్నా దృష్టి సుమిత్రకే ఎక్కువగా తగిలిందేమో?

అమ్మా నాన్నలతో తన యిష్టాన్ని తెలియ చేశాడు ఫణీంద్ర. పెళ్ళి అయిన వెంటనే సుమిత్ర వాళ్ళింటికి ఫణీంద్ర తల్లిదండ్రులు వెళ్ళారు. ఫణీంద్రని తమ అల్లుడుగా చేసుకోవడానికి ఏ మాత్రం అభ్యంతరంలేదని, సుమిత్ర అభిప్రాయం తెలుసుకుని, ఫైనల్‌గా మాట్లాడుకుందామన్నారు. ఏ విధంగా ఆలోచించినా సుమిత్ర తనను కాదనే అవకాశం లేదనుకున్నాడు. తమ బంధువుల కుటుంబంలో మరీ చిన్న వయస్సులో ఆఫీసర్ అయింది తానొక్కడే. ఆర్థికంగా కూడా బాగా నిలదొక్కుకున్నారు. అందులోను, ఏ కట్నం, కానుక ఆశించకుండా పెళ్ళి చేసుకోవడానికి సుముఖత చూపించిన తనని ఎవరైనా తిరస్కరించగలరా?

నో. అంత మూర్ఖులు ఉండరు.

కానీ...

ఆ సాయంత్రమే తెలిసింది. సుమిత్ర తనతో పెళ్ళికి అంగీకరించలేదని.

ఎందుకు? అని ఆమెని నిలదీసి అడుగుదామనుకున్నాడు. కానీ 'అహం' అడ్డొచ్చింది. తను అడగడమేమిటి పెళ్ళి అవ్వదన్నట్టు అనుకుని, తనని 'వదులు' కోవడం సుమిత్ర దురదృష్టంగా భావించాడు.

అదే జీవితంలో మొదటి పరాజయం. అన్నింటిని వూహించగలిగిన తను ఒక 'మామూలు స్త్రీ' మనసు నెందుకు సరిగ్గా వూహించలేక పోయాడో అర్థం కాలేదు. 'బహుశా ఎవడితోనే సంబంధం పెట్టుకున్నట్టుంది' అందుకే తనని వద్దన్నది అని తృప్తి పడ్డాడు. సుమిత్ర కాదనదన్న ఆవేశంలో వీలైనంత తొందరగా పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు.

పెళ్ళయ్యింది. లక్ష్మీ కూడా బంధువుల అమ్మాయే. పెళ్ళిలో లక్ష్మీ అదృష్టానికి అసూయ పడని వాళ్ళు లేరు. లక్ష్మి సుమిత్రంత అందగత్తె కాకపోయినా ఆమె అందం ఆమెది. సృష్టిలో ఎవరికి వారే ప్రత్యేక అందం కల్గి ఉంటారనుకున్నాడు ఫణీంద్ర.

... జీవిత భాగస్వామిగా వచ్చిన లక్ష్మీ కూడా ఎప్పుడూ అర్థంకానీ ప్రశ్నలా ఉండేది. తనకి ప్రమోషన్ వచ్చిందన్నా, హోదా పెరిగిం దన్నా, ఎందుకో 'ప్యాసివ్'గా కన్పించేది. అలాగని ఆనందపడట్లేదని కాదు. చిత్రంగా నవ్వేది. ఆ నవ్వులో జీవితపు తాలూకు, నైరాశ్యం, నిర్వేదం, వేదాంతం, వైరాగ్యం ఎక్కువగా కన్పించేవి. తన కళ్ళకే ఆ నవ్వు అలా అన్పిస్తోందా అనే అనుమానం కూడా కలిగేది. మామూలు బ్రతుకు లోని ఆనంద విచారాలకి అతీతంగా ఉన్నట్టు, అలౌకిక ప్రపంచంలో సాగిపోతున్నట్టు ఉండేది. మరీ మితభాషి. అవసరమనుకున్న ఒక్కోసారి మాట్లాడేది కాదు. ఒక్కో రోజయితే రోజుకి ఒకటో రెండో మాటలు మాట్లాడేది. నిశ్శబ్దమంత నిశ్శబ్దంగా నిశ్శబ్దంలో కలిసి పోయేది.

... వెన్నెల, వేకువ, పిల్లగాలి, చిరుజల్లు, అగరు సుగంధం,

హరివిల్లు రంగులు ఇవేమీ ఆమెని 'కదిలించనట్టుగా అన్పించేది కాదు. ఎప్పుడూ, కిటికీ తెరిచి అనంత ఆకాశంలోకి చూపులు విసిరేది ... ఆ చూపుల అర్థం ... అంతరార్థం ఏ మాత్రం అర్థమయ్యేవి కావు!

...నిర్మలాకాశాన్ని చూసినా, మేఘాలు కమ్మిన ఆకాశాన్ని చూసినా ఒకే ఫీలింగా? ... ఆ చూపులకి, భావాలకి అర్థాలు వెతకాలని ప్రయత్నించాడు ... ఆ ప్రయత్నం ఏ మాత్రం సఫలీకృతం కాకుండనే .... ఆమె శూన్యాకాశపు ఆవరణలోకి చేరుకుంది! కిటికీ దగ్గర రోజూలాగే ఆరోజు కూర్చొని, దూరంగా ఎగురుతున్న పక్షుల్ని చూస్తున్నట్టుగానే కన్పించింది ... సాయంత్రం అయినా కుర్చీలోంచి కదలకపోయేసరికి ఏమైందో అని చూస్తే ఏముంది? మంచుగడ్డలా చల్లబడి శరీరం తాకేసరికి గుండె జల్లుమంది. లక్ష్మి తనకి అందని దూరాలకి వెళ్ళిపోయినందుకు బాధపడాలో, ఆనంద పడాలో, ఏమాత్రం ఇబ్బంది కల్గించకుండా తనదారిలో తాను వెళ్ళిపోయినందుకు బాధపడాలో తెలీని స్థితి?!!

సరిగ్గా లక్ష్మి మరణించిన రోజే సుమిత్ర గుర్తుకు వచ్చింది. ఎలావుందో (?) అనుకున్నాడు. ఆ ప్రశ్న బుర్రలో మెదలిన మరుక్షణం అన్పించింది తనకెందుకు అని. తనకెందుకు అన్న ప్రశ్న తనకే ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు ఫణీంద్రకి తనలోనే తనకే అర్థం కాని విషయాలు వున్నప్పుడు ఎదుటి వారిలో తనకి అర్థం కాని విషయాలు వుండడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

అందులోను, ఆడవాళ్ళ మనసు లోతులు అర్థం చేసుకోవడం అంత సులభం కాదని అర్థమైంది!

అర్థమైనట్టు అన్పించినా అది భ్రమ అని అర్థమైంది. ఎందుకంటే సుమిత్ర ఎందుకు తనని కాదందో, లక్ష్మి ఎందుకు అపరిచితంగా వుండేదో ఎప్పుడు ఆలోచించినా, ఎంత ఆలోచించినా ఏమాత్రం తెలిసేది కాదు.

...హోదా మీద హోదాని కలుపుకుంటూ జీవితం సాగిపోతోంది. తనకే తెలీకుండా (నిజానికి తెలుసా? తెలుసు. తెలీదు) జీవిత ప్రాంగణంలో అడుగు పెట్టింది రోహిణి... తన ఆఫీసులోనే పనిచేస్తున్న, తను ఆ డిపార్ట్‌మెంట్ చీఫ్‌గా వచ్చేంత వరకు రోహిణి గురించి తెలీదు .... రోహిణి ... జీవచ్ఛవంలా బ్రతుకుతున్న రోహిణి ... జీవచ్ఛవమే ... ఆమె అంది మొదటి పరిచయంలో ... పెద్దల్ని ఎదిరించి ప్రేమించిన 'వాడి' తో జీవితం పంచుకోవడానికి కదిలింది ... మంచిగానే పంచన చేసాడు .... తను అతను పెళ్ళి చేసుకున్నాకా తెలిసిన విషయం ... అతని కెప్పుడో పెళ్ళయిందని, పిల్లలున్నారని ... అతని 'మొదటి భార్య' పెద్ద గొడవ చేసి ... సంఘంలో దృష్టిలో రోహిణిని 'పతిత' గా

చిత్రించి ... అతన్ని తీసుకెళ్ళిపోయింది. ఆర్థికంగా సపోర్టు చేస్తూ వుద్యోగం వుంది కాబట్టి .... బ్రతుకు రథం సాగుతోంది ..... "సాగినంత కాలం సాగనీ బ్రతుకునాటకం .... అనుకుంటూ సాగిపోతున్నాను..." అంది. చిత్రం ....

సుమిత్రని .... లక్ష్మిని .... రోహిణిని పోలుస్తోంది మనసు .... సుమిత్రలో అందముంది .... లక్ష్మిలో నిశ్శబ్దముంది .... రోహిణిలో పై రెండు కానీ చిత్రమైన ఆకర్షణ ... నిజాని కది రెండుకానీ ఆకర్షణో .... రెండు కలిసిన ఆకర్షణో ....? సుమిత్ర మానసిక పరిస్థితి పూర్తిగా చదివే అవకాశం లేకపోయింది. లక్ష్మి మానసిక పరిస్థితి అపరిచితంగా పరిచితం .... రోహిణిని చూస్తే ఎక్కడో చూసినట్టు, ఏళ్ళ తరబడి ఎడతెగని అన్వేషణ చేస్తున్నట్టుగా కన్పిస్తోంది. మాట్లాడుతుంటే కాలమే తెలీదు .... ఇద్దరు ఈమధ్య మానసికంగా దగ్గరయ్యారు .... అభిరుచులు కలిసాయి... ఠాగూరు గీతాల్ని ఆలపిస్తుంటే ప్రాచీన రాగాలు కొండ కోనల్లో ప్రతిధ్వనించినట్టు, సెలయేరులో ఆత్మైకానందం కోసం స్నానిస్తున్నట్టుగా వుంటుంది ... "... ఈ జీవశ్ఛవంలో కాస్త నవ్వుని, పిసరంత తుళ్ళింతని యిచ్చేవి ఈ పుస్తకాలే..." అని పుస్తకాలు చూపించింది. బైరన్, షెల్లి, కీట్స్ లాంటి పాశ్చాత్య కవులనేకాక, కృష్ణశాస్త్రి, చలం రచనలు కూడా వున్నాయి .... రోహిణికి, కాలమనే కొవ్వొత్తిని కరిగించ డానికి పుస్తకాలే అగ్నిశిఖలుట.


రోజులు సాగుతున్న కొద్దీ మరీ దగ్గరయినట్టు అన్పిస్తోంది. ఆమెని చూడలేందే వుండలేని పరిస్థితి వచ్చింది. ఆమెతో మాట్లాడకపోతే గుండె ఆగిపోతుం దేమో అన్పిస్తోంది .... ఆఫీసులో కూడా తమ గురించి చెవులు కొరుక్కుంటున్నారని తెలిసింది ......

....రోహిణిలో, లక్ష్మిలోనూ, సుమిత్ర లోనూ కూడా లేని 'ఏ' (ఏ అంటే ఏమిటని నిలదీస్తే చెప్పడం కష్టం) వున్నట్టు అన్పిస్తోంది... నిన్న రాత్రి ... బాగా పొద్దుపోయే దాకా ఆమె యింట్లోనే వున్నాడు .... తిరిగి వచ్చేటప్పుడు రోహిణి భుజాల మీద చేతులువేసి, ఆరాధనగా కళ్ళలోతుల్లోకి చూసి, పెదవులపై లలిత లలితంగా చుంబిస్తే గుండె అట్టడుగు పొరల్లో తీపిసెగ ....! తిరిగి వస్తున్నప్పుడు మధ్యదారిలో అన్పించింది....తామెందుకు పెళ్ళి చేసుకోకూడదని!

...పెళ్ళి....పెళ్ళయితే చాటు మాటుగా గుసగుసలు వుండవు .... మహా అయితే ఆఫీసులో ఓ రెండు రోజులు వెర్రి ఆశ్చర్యాలు ప్రకటిస్తారేమో!

...పెళ్ళి చేసుకోవాలనే వుహ వచ్చినప్పటి నుండి ఒకరకమైన టెన్షన్ మొదలయినంది ఫణీంద్రలో శరీరంలో వణుకు .... అసలు పెళ్ళి టాపిక్ ఎలా మాట్లాడాలి అనే ఆలోచనలోపడ్డాడు ... సీరియస్‌గా చెప్తే బాగుంటుందా?.... సరదాగా మాట్లాడితే ....? కాసేపు వేరే విషయాలు మాట్లాడి తరువాత పెళ్ళి మాటలు మాట్లాడితే ....? సూటిగా పెళ్ళి విషయం చెప్తే ... రకరకాల రిహార్సిల్స్ వేసుకుని .... ఖచ్చితంగా ఇలా మాట్లాడాలి అని నిర్ణయం తీసుకోలేక .... ముందురోజు అనుకున్న సమయానికి రోహిణి యింటికి టెన్షన్‌తో నె బయలుదేరాడు ఫణీంద్ర.

..రోహిణి యింటికి ఎవరో మిత్రులు వస్తే మాట్లాడుతోంది. వాళ్ళని పరిచయం చేసినా, వాళ్ళు వున్నంత వరకు టెన్షన్‌గానే వుంది. వాళ్ళు వెళ్ళిపోయాకా -




రోహిణిని అనునయంగా దగ్గరికి తీసుకుంటూ - "....రోహిణి .... నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి..." అన్నాడు. రోహిణి చిత్రంగా నవ్వింది. కాసేపు నిశ్శబ్దం. చెప్పమన్నట్టు కళ్ళలోకి చూసింది. ఆమె కళ్ళలోకి సూటిగా చూడలేనట్టు పక్కకి చూస్తు - "....మనిద్దరం పెళ్ళి చేసుకుంటే బాగుంటుందేమో...." వెంటనే ఏ జవాబు రాలేదు. భరించలేని నిశ్శబ్దం.

ఆలోచిస్తున్నట్టుగా వుండి పోయింది. కొంతసేపు గడిచాకా .....

... ఇలాగే వుండి పోతే నష్టమేమిటి?....' 'ఎదురు ప్రశ్న వేసింది. వూహించని ప్రశ్న. జవాబు లేదు ఫణీంద్ర దగ్గర. మరో రెండు నిముషాలు గడిచాకా, గాఢంగా రోహిణి అంది -

"...మానసికంగా మనమెంతో దగ్గరయ్యామే ....పెళ్ళయినా చాలా మందిలో కరువవుతున్న ఆత్మీయత మన మధ్య వుంది .... మరి పెళ్ళెందుకు?...." అర్థం కానట్టు చూశాడు ఫణీంద్ర.

ఏ స్త్రీ అయినా, అందులోను ఏ తోడు లేని రోహిణి లాంటి స్త్రీ జీవితాంతం ఓ తోడుని కోరుకోవడం సహజం. బంధాన్ని పెళ్ళితో ముడివేసుకోవాలని ఆశించడం మరీ సహజం.

మరి రోహిణెందుకు ఇలా?

...ఎందుకో, సుమిత్ర, లక్ష్మిలు గుర్తుకు వచ్చారు .....

సుమిత్ర .....

మామూలు మనిషి .... కానీ తనని పెళ్ళి చేసుకోనన్నది ....

లక్ష్మి .....

పెళ్ళి చేసుకుంది ....... అపరిచిత జీవితం గడిపింది ....

ఇప్పుడు రోహిణి ....

పెళ్ళేవద్దు .... ఇలాగే వుండి పోతా మంటోంది!

మరోసారి స్త్రీ విషయంలో విఫలమయ్యాడు ... అది పరాజయం అనుకుంటున్నా అవునో, కాదో కూడా తెలీదు ... అవును ... ఏదీ అర్థంకానీ స్థితి ... పెద్ద పజిల్ .... స్త్రీ మనసు లోతుల్లో ఏముందో తనకీ మాత్రం అర్థం కావడం లేదు ....

తనకీ కాదు ... తనలాంటి చాలా మందికీ అర్థం కాదేమో అన్పిస్తోంది ఫణీంద్రకి!!!